

పోలీస్ పరేడ్ మైదానంలో గణతంత్ర వేడుకలకు ముస్తాబైన వేదిక



విద్యుత్‌కాంతుల వెలుగులో క్లాక్ టవర్

గణతంత్ర కాంతులు

వేడుకలకు సిద్ధమైన పరేడ్ మైదానం

అనంతపురం టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాలకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానం సిద్ధమైంది. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదివారం ఉదయం పరేడ్ మైదానంలో జాతీయజెండాను ఎగురవేస్తారు. ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు పురస్కారాలను ప్రదానం చేస్తారు. వేడుకలలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొంటారు. పోలీసుల గౌరవ వందనం, విన్యాసాలు, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. మైదానాన్ని రంగువల్లులతో అలంకరించారు. పరేడ్ మైదానం, పరిసర ప్రాంతాలలో భారీ భద్రత ఏర్పాటు చేశారు. జిల్లాకు తలమానికమైన అనంత క్లాక్ టవర్‌ను విద్యుద్దీపాలతో అలంకరించారు. జేసీ శివనారాయణశర్మ, డీఆర్వో మలోల, ఆర్డీఓ కేశవనాయుడు వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

261 మందికి పురస్కారాలు

అనంతపురం టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాల సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన 261 మంది అధికారులు, ఉద్యోగులను పురస్కారాలకు ఎంపిక చేశారు. వీరిలో ఏడుగురు జిల్లా ఉన్నతాధికారులు ఉన్నారు. జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంపీ పీడీ రఘునాథరెడ్డి, హార్టికల్చర్ అధికారి నరసింహారావు, డ్వామా పీడీ సలీమ్‌బాషా, సీపీటీఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శిరీష, ఉరవకొండ సీడీపీఓ శ్రీదేవి, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు పురస్కారాల జాబితాలో ఉన్నారు. పోలీస్ పరేడ్ మైదానంలో ఆదివారం జరిగే గణతంత్ర వేడుకలలో పురస్కారాలను కలెక్టర్ ప్రదానం చేస్తారు.

హక్కుల సాధన ఆయుధం.. ఓటు : జేసీ



యువ ఓటరుకు తొలి ఐడీ కార్డును అందజేస్తున్న జేసీ

అనంతపురం టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకునే సాధనం ఓటు అని జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వివిధ పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులు, సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించారు. యవ ఓటర్లకు తొలి ఓటరు ఐడీ కార్డులను జేసీ అందజేశారు. ఓటు విలువపై ప్రతిజ్ఞ చేయించారు. ఓటర్లను ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు ఏటా జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని జేసీ అన్నారు. ప్రతి సంవత్సరం ఒక థీమ్‌తో ఎన్నికల కమిషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని అన్నారు. 'పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి. ఓటుకు సమానమైనది ఏదీ లేదు. ఖచ్చితంగా ఓటు వేస్తాను' అనే థీమ్‌తో ఈ ఏడాది కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఆర్వో మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతనాయుడు, ఈఆర్ఓలు శిరీష, మల్లికార్జున, డీసీహెచ్ఎస్ డాక్టరు రవికుమార్, కలెక్టరేట్ విభాగాల అధికారులు అలెగ్జాండర్, రియాజుద్దీన్, యుగేశ్వరి, వివిధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీఎస్ విజయానంద్ నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ సమక్షంలో సీఎస్ నుంచి అవార్డు అందుకుంటున్న ఎస్పీ జగదీష్

సమష్టి కృషికి సత్కారం

అనంతపురం టౌన్/క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా సవరణ, యువ ఓటర్ల నమోదు ప్రక్రియలో జిల్లా అధికార యంత్రాంగం కృషికి తగిన గుర్తింపు లభించింది. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, అనంతపురం తహసీల్దారు హరికుమార్, రాప్తాడు బీఎల్ఓ రూప, రాయదుర్గం బీఎల్ఓ అంజలికి రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారాలను రాష్ట్ర ఎన్నికల సంఘం అందజేసింది. వీరు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతుల మీదుగా శనివారం పురస్కారాలను అందుకున్నారు. జిల్లా యంత్రాంగం సమష్టి కృషితోనే పురస్కారాలు దక్కాయని కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. సమన్వయంతో పనిచేసి జిల్లాను అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా భద్రతా విధులను నిర్వర్తించినందుకు ఎస్పీకి అవార్డు దక్కింది. డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ సమక్షంలో సీఎస్ నుంచి అవార్డును అందుకున్నారు.

గణతంత్ర వేడుకలకు జస్టిస్ శ్రీనివాస రెడ్డి



జస్టిస్ శ్రీనివాసరెడ్డిని కలిసిన న్యాయవాదులు

అనంతపురం క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాలలో పాల్గొనేందుకు హైకోర్టు పోర్టుఫోలియో న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి శనివారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయనకు జిల్లా న్యాయాధికారులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కోర్టు ఆవరణలో ఆంధ్రాబ్యాంకు ఏటీఎంను జస్టిస్ శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, ఇతర న్యాయాధికారులు పాల్గొన్నారు. అనంతరం జ్యుడీషియల్ వర్క్ షాపుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు. కోర్టు ఆవరణలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించాలని బహుజన లాయర్స్ ఫోరం నాయకులు విన్నవించారు. ఫోరం గౌరవాధ్యక్షుడు నారాయణ, ఉపాధ్యక్షులు అజీజ్, మహేశ్వరి, శ్రీనివాసులు, న్యాయవాదులు నారాయణరెడ్డి, రమేష్‌నాయుడు, సత్యనారాయణగుప్తా పాల్గొన్నారు.

ఫిజిక్స్ టీచర్‌కు ప్రథమ బహుమతి



అనంతపురం విద్య, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ మండలం ఆమిద్యాల జడ్పీ ఉన్నతపాఠశాల ఫిజిక్స్ టీచర్ బండి శ్రీనివాసులు దక్షిణ భారత స్థాయి వైద్య విజ్ఞాన సదస్సులో పాల్గొని ప్రథమ బహుమతి సాధించారు. పుదుచ్చేరిలో ఈ నెల 21 నుంచి నాలుగు రోజులపాటు విద్యావైజ్ఞానిక ప్రదర్శనలను నిర్వహించారు. టీచర్స్ విభాగం నుంచి బండి శ్రీనివాసులు పాల్గొన్నారు. 'కాంతి ధర్మాలను సులువుగా వివరించేందుకు ఉపయోగపడే ప్రయోగ పరికరాలు - నిత్యజీవితంలో కాంతి ధర్మాలు ఏ విధంగా ఉపయోగపడుతాయి' అనే అంశంపై ఆయన తయారు చేసిన ప్రాజెక్టు ప్రథమ బహుమతిని గెలుచుకుందని డీఈఓ ప్రసాద్‌బాబు, జిల్లా సైన్స్ ఆఫీసర్ బాలమురళీక్రిష్ణ శనివారం తెలిపారు. పుదుచ్చేరి గవర్నర్, విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా ఆయన బహుమతిని అందుకున్నారు. అనంతపురం జిల్లా నుంచి గ్రూప్ కేటగిరీలో పాల్గొన్న విద్యార్థుల నమూనా సైతం స్పెషల్ కేటగిరీ కింద బహుమతికి ఎంపికైంది. కణేకల్లు మండలం హనకనహాళ్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు గీతారెడ్డి, మహాలక్ష్మి, గైడ్ టీచర్ మేడా ప్రసాద్ రూపొందించిన 'వృద్ధులకు ఉపయోగపడే ఊతకర్ర' స్పెషల్ కేటగిరీకి కింద ఎంపికైంది. నిర్వాహకులు వీరికి బహుమతిని అందించారు. విజేతలను డీఈఓ అభినందించారు.

విజేత సూపర్‌మార్ట్ ప్రారంభం



స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ



సూపర్ మార్ట్‌ను సందర్శిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు

అనంతపురం కల్చరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని రామ్‌నగర్ 80 అడుగుల రోడ్డులో విజేత సూపర్‌మార్ట్‌ను ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంఎస్ రాజు, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ శనివారం ప్రారంభించారు. వ్యాపారపరంగా అనంతపురం విస్తరిస్తోందని అన్నారు. నాణ్యత, నమ్మకానికి బ్రాండ్‌గా ఉండేలా విజేత సూపర్‌మార్ట్‌లను ఎండీ జగన్మోహన్‌రావు అన్ని జిల్లాల్లోనూ విస్తరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో విజేత మార్ట్ నిర్వాహకులు సందీప్, హరికృష్ణ, టీడీపీ నాయకులు ముంటిమడుగు కేశవరెడ్డి, రామలింగారెడ్డి, ఆదినారాయణ, సరిపూటి రమణ, రాయల్ మురళి, టీఎన్ఎస్ఎఫ్ లక్ష్మీనారాయణ, కూచె హరి, బుగ్గయ్య చౌదరి, నెట్టెం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేమకల్లు ఆంజనేయుడికి విశేష పూజలు

బొమ్మనహాళ్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి మూలవిరాట్‌కు శనివారం విశేష పూజలు జరిగాయి. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్ చార్యులు, పవన్ కుమార్ పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, అష్టోత్తరం జరిపించి పుష్పాలంకరణ చేసి నైవేద్యం సమర్పించారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

నెట్టికంటికి వెండి రథ ప్రాకారోత్సవం




గుంతకల్లు, జనవరి25(ఆంధ్రజ్యోతి): కసాపురం ఆలయంలో శనివారం స్వామివారికి వెండి రథ ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం 6-40 గంటలకు అర్చకులు సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయుల ఉత్సవ విగ్రహాలకు సర్వాంగ సుందరంగా అలంకారాలు చేసి వెండి రథంపై ఆశీనులను చేశారు. ఆలయ ఈఓ వాణి ఆధ్వర్యంలో స్వామివార్ల వెండి రథ ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సూపరింటెండెంటు పిడికిటి వెంకటేశ్వరులు, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.



అలంకారాలలో స్వామివార్లు.. కసాపురం ఆలయంలో వెండి రథ ప్రాకారోత్సవం



ఎంగిలిబండ రాజుకు చెందిన ఏటీఎం కార్డు మారుస్తున్న దుండగులు



ఏమార్చి లూటీ!

ఏటీఎం కార్డు మార్చి డబ్బు కాజేస్తున్న దుండగులు

- డబ్బు డ్రా చేయడం రాక వారికిస్తే అంతే సంగతి
- ఏటీఎం సెంటర్ల వద్ద కాపు కాస్తున్న 'వేటగాళ్లు'
- అమాయకులే వారి టార్గెట్
- గుత్తిలో జూలై నుంచి 15 సంఘటనలు
- ఐదు నెలల కిందట తాడిపత్రిలో నాలుగు...

ఏటీఎం కార్డు వాడటం రాని అమాయకులకు సాయం చేస్తున్నట్లు నటించి, బురిడీ కొట్టించే ఘటనలు జిల్లాలో ఇటీవల ఎక్కువ అయ్యాయి. గుత్తి పట్టణ పరిధిలోనే ఇటీవల వరుసగా నాలుగు ఘటనలు జరిగాయి. గత ఏడాది జూలై నుంచి గుత్తి పట్టణ పరిధిలోనే 15 ఘటనలు జరిగాయి. ఐదు నెలల కిందట తాడిపత్రి పట్టణ పరిధిలో నలుగురు ఇలానే మోసపోయారు. రెండు నెలల కిందట ఉరవకొండలో రైతును ఓ దుండగుడు ఇలానే మోసం చేశాడు. మోసపోయామని బయటకు చెప్పుకోలేని బాధితులు ఎంతో మంది ఉన్నారు. కొందరు ఆగంతకులు నకిలీ కార్డులతో ఏటీఎం సెంటర్ల వద్ద కాపు కాస్తున్నట్లు తెలుస్తోంది. గంటలకొద్దీ వేచి చూసి ఏటీఎంను ఆపరేటింగ్ చేయడం రాని వారిని మోసగిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి అనంతపురం క్రైం

ఎలా బురిడీ కొట్టిస్తారంటే...

దుండగులు ఏటీఎం సెంటర్ల వద్దే ఉంటారు. నగదు డ్రా చేస్తున్నట్లో.. క్యాష్ చెక్ చేస్తున్నట్లో నటిస్తుంటారు. లేదా అక్కడే ఫోన్‌లో మాట్లాడుతూనో కనిపిస్తారు. వారు ఏటీఎం ఆపరేట్ చేయడం రాని వ్యక్తుల ముఖకవళికలను సులభంగా కనిపెట్టేస్తారు. ఎవరైనా డబ్బు తీసిస్తారా...? అని అడగడం ఆలస్యం... వెంటనే ముందుకు వస్తారు. తొలుత వారి ఏటీఎంల ద్వారా మిషన్‌లో కార్డు పెట్టి పాస్ వర్డ్ కనుక్కుంటారు. కానీ డబ్బు విత్ డ్రా చేయరు. సర్వర్ సమస్య వస్తుందని కహానీలు చెబుతారు. ఇంకా కొంచెం టైం పడుతుందని చెబుతారు. నాకూ పనుందని చెప్పి, నకిలీ కార్డు చేతిలో పెట్టి వెళ్తారు. అలా బయటకు వెళ్లిన కొంతసేపటికే మరో ఏటీఎంలో డబ్బు డ్రా చేస్తారు. దుండగుడు కార్డు ఇచ్చేటప్పుడే దాన్ని చెక్ చేసుకుంటే మోసపోయే అవకాశం తగ్గుతుంది.

బ్యాంకుల నిర్లక్ష్యం

ఏటీఎంల వద్ద బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. అక్కడ సెక్యూరిటీ గార్డులు లేకపోవడంతోనే ప్రజలు అపరిచితులను ఆశ్రయించాల్సి వస్తోంది. కొన్ని ఏటీఎం సెంటర్లలో గార్డులున్నా ఆగంతకులు అక్కడే తచ్చాడుతుంటారు. అయినా వారిని ప్రశ్నించడంలో గార్డులు విఫలమవుతున్నారు. బాధితులు ఇలా మోసపోకుండా బ్యాంకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

గర్భిణి అన్న కనికరం లేకుండా..!

గుత్తి ఆర్టీసీ బస్టాండ్‌లో ఇండియన్ ఏటీఎం సెంటర్లో ఓ మహిళ నుంచి ఏటీఎం కార్డు మార్చి రూ.50వేలు సొమ్ము దోచేశారు. పెద్దవడుగూరు మండలం గుత్తి అనంతపురానికి చెందిన చిలకల వేదవతి(గర్భిణి) డెలివరీ కోసం ఆసుపత్రికి వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో ఈనెల 21డబ్బు అవసరమై మరో మహిళతో కలిసి ఆర్టీసీ బస్టాండ్‌లోని ఇండియన్ ఏటీఎం సెంటర్‌కు వెళ్లారు. అక్కడ ఆగంతకులు ఏటీఎం కార్డు మార్చారు. నకిలీ కార్డు ఆమెకిచ్చారు. కానీ 22, 23 తేదీల్లో రెండు రోజుల పాటు ఆమె ఏటీఎం కార్డు ద్వారా రూ.50వేలు డ్రా చేశారు.



గద్దల లక్ష్మీదేవి ఏటీఎం కార్డు అపహరిస్తున్న దుండగుడు

● తాడిపత్రి పట్టణంలో ఐదు నెలల కిందట నెలన్నర వ్యవధిలో ఆరు సంఘటనలు ఇలాంటివే జరిగాయి. రాఘవయ్య అనే బాధితుడు రూ.40వేలు నష్టపోయాడు. మరో వ్యక్తి ఏటీఎంను ఏమార్చి రూ.20వేలు డ్రా చేశారు. మరో నలుగురి నుంచి రూ.80డ్రా చేసినట్లు బాధితులు వాపోయారు.

● ఈనెల 10వతేదీ గుత్తి పట్టణానికి చెందిన వృద్ధురాలు లక్ష్మీదేవి తన భర్తతో ఏటీఎం కార్డు ఇచ్చి పంపింది. రూ.3వేలు డ్రా చేయమని చెప్పింది. ఏటీఎం సెంటర్‌లో ఆపరేటింగ్ చేయడం రాకపోవడంతో అక్కడే ఉన్న ఓ యువకుడిని అతడు సాయం అడిగాడు. ఇదే అవకాశంగా భావించిన ఆ యువకుడు వృద్ధుడిని మభ్యపెట్టాడు. పాస్ వర్డ్ తెలుసుకుని అందులో టైప్ చేశాడు. కానీ నగదు డ్రా చేయలేదు. సర్వర్ బిజీగా ఉందని, మళ్లీ తీసుకోవాలని, తనకు పనుందని బయటకు వెళ్లిపోయాడు. అయితే ఆ వృద్ధుడి ఏటీఎం కార్డు గుట్టుగా తనవద్ద ఉంచుకుని మరో కార్డు అతడి చేతిలో పెట్టాడు. కొంతసేపటికే ఆ దుండగుడు మరో ఏటీఎంలో రూ.9300 డ్రా చేశాడు. నగదు డ్రా అయినట్లు వృద్ధుడికి మెసేజ్ రావడంతో ఆందోళన చెందాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టారు.

● ఈనెల 17న గుత్తి రూరల్ మండల పరిధిలోని ఎంగిలిబండకు చెందిన రాజు మోసపోయాడు. తల్లి అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్యం కోసం రాజు, భార్య లక్ష్మి పేరుతో తొండపాడు కెనరా బ్యాంకులో స్వయం సహాయక గ్రూపులోని పొదుపు సొమ్ము రూ.1.26లక్షలు రుణం తీసుకున్నారు. గుత్తిలోని ఏటీఎం సెంటర్‌కు డబ్బు డ్రా చేయ డానికి వెళ్లాడు. ఈ సమయంలో ఇద్దరు గుర్తుతెలియని దుండగులు డ్రా చేయడానికి సాయం చేస్తామన్నారు. ఆ ముసుగులో పాస్‌వర్డ్ తెలుసుకున్నారు. వారి దగ్గరున్న నకిలీ ఏటీఎం కార్డు రాజుకు ఇచ్చి, అతడి కార్డుతో వెళ్లిపోయారు. ఆ దొంగలు అదే రోజు కర్నూలు నగరంలోని ఓ ఏటీఎంలో రూ.1.26లక్షలు డ్రా చేసుకున్నారు. మూడు రోజుల తరువాత రాజు గుత్తికి వచ్చి ఏటీఎం మరో వ్యక్తితో చూపించాడు. కానీ అది నీది కాదని, పాస్‌వర్డ్ సెట్ కాలేదని చెప్పడంతో అది నకిలీదిగా తేలడంతో రాజు నిర్ఘాంతపోయాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

● చదువురాని వారు మోసపోతున్నారంటే అవగాహన లేదనుకోవచ్చు. కానీ యానిమేటర్లు కూడా మోసపోతుండటం విస్తు గొలుపుతోంది. గత ఏడాది జూలై11న వెలుగు డీఆర్‌డీఏ కార్యాలయంలో పనిచేస్తున్న యానిమేటర్ గద్దల లక్ష్మి ఇలానే మోసపోయింది. గుర్తు తెలియని వారిని నమ్మి ఏటీఎం కార్డు అందజేసి రూ.47వేలు డ్రా చేయడంతో లబోదిబోమంది.

● రెండు నెలల కిందట యాడికికి చెందిన ఈశ్వరయ్యకు చెందిన ఏటీఎం కార్డు మార్చి దుండగులు రూ.46వేలు డ్రా చేసుకున్నారు.

● గత ఏడాది ఆగస్టు 31న పి.ఎర్రగుడుకు చెందిన శ్రీనివాసులు నుంచి రూ.24వేలు డ్రా చేశారు. ఏటీఎం కార్డుతోనే అతనూ మోసపోయాడు.

● ఉరవకొండలో గత ఏడాది నవంబరులో ఓ పల్లెటూరి పెద్దమనిషి ఏటీఎం వద్దకు వెళ్లాడు. డబ్బు తీయిస్తానని చెప్పి న ఆ అగంతకుడు మెషీన్ సరి గా పనిచేయడం లేదని చెప్పి ఏటీఎం కార్డు మార్చి వెళ్లాడు. కొంతసేపటికే మరో ఏటీ ఎం నుంచి రూ.79వేలు డ్రా చేసుకుని ఉడాయించాడు. దీంతో ఆ పెద్దమనిషి లబోదిబోమని పోలీసులను ఆశ్రయించాడు.



బ్యాంకులో సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు

కేసులు...ఉత్తుత్తేనా..?

ఏటీఎంల వద్ద కార్డుల ద్వారా మోసపోతున్న బాధితులు చాలా మందే ఉంటున్నారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లను ఆశ్రయిస్తున్నప్పుడు వివరాలు రాసుకుని, ఏటీఎం సెంటర్లలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కానీ అక్కడికే పరిమితమై కేసులు నమోదు చేయడం లేదనే ఆరోపణలున్నాయి. కేసులు కడితే తప్పనిసరిగా దుండగులను పట్టుకోవాలి. లేకుంటే అవి పెండింగ్ కేసుల జాబితాలో ఉండే ప్రమాదం ఉంది. ఇవి ఉన్నతాధికారులతో తలనొప్పికి దారి తీస్తాయని కేసులు నమోదు చేయడం లేదని సమాచారం. అలాంటి వాటిపై పోలీసులు పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటివరకు ఏటీఎం మోసాలకు సంబంధించి పోలీసులు దుండగులను అరెస్ట్ చేసిన దాఖలాలు లేదా రికవరీ చేసిన వ్యవహారాలు లేవు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించినంతకాలం ఏటీఎం కార్డుల మోసాలు జరిగే అవకాశం ఉంది.

మీ అభిమానాన్ని గుండెల్లో పెట్టుకుంటాం

ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్



విలేకరులతో మాట్లాడుతున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

రామగిరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పరిటాల రవీంద్ర 20వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని, ప్రజలు చూపిన అభిమానాన్ని గుండెల్లో పెట్టుకుంటామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. వెంకటాపురంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. పరిటాల రవి వర్ధంతి సందర్భంగా వెంకటాపురం గ్రామానికి వేలాది మంది జనం తరలివచ్చారని, ప్రజానేతపై అభిమానాన్ని చాటుకున్నారని అన్నారు. జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని పలుప్రాంతాలు, తెలంగాణ, కర్ణాటక నుంచి ప్రముఖులు, అభిమానులు వచ్చి ఘన నివాళులు అర్పించారని అన్నారు. ఈ కార్యక్రమం కోసం వారం రోజులపాటు శ్రమించిన పోలీసులు, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ, శానిటేషన్ సిబ్బంది, వలంటీర్లు, కళాకారులు, భోజనశాల నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయం, రాష్ట్రంలోని టీడీపీ కార్యాలయాలు, ఇతర ప్రాంతాలలో రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారని, నివాళులు అర్పించారని, జనం చూపిన ఈ అభిమాన్ని ఎప్పటికీ మరువలేమని అన్నారు. పరిటాల రవి మరణించి 20 ఏళ్లు గడిచినా ప్రజల గుండెల్లో ఇంకా ఆయనకున్న స్థానం చూసి చలించిపోయామని అన్నారు. వర్ధంతికి వచ్చిన జన స్పందన తమ బాధ్యతను మరింత పెంచిందని అన్నారు. పరిటాల చూపిన మార్గంలో రానున్న రోజుల్లో ఉచిత వివాహాలు, మెగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని అన్నారు. ఇక నుంచి రవి ఆశయ సాధనలో మరిన్ని అడుగులు పడతాయని, ప్రజల ఆదరాభిమానాలు ఇలాగే ఉండాలని కోరుకుంటునామని వారు అన్నారు.

రేపటి నుంచి బాలికల హాకీ టోర్నీ


అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఫాదర్ ఫెర్రర్ ఏపీ సబ్ జూనియర్ హాకీ బాలికల 13వ రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు జరుగుతాయి. ఆర్డీటీ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహిస్తామని హాకీ అనంతపురం జిల్లా కార్యదర్శి అనీల్ కుమార్ తెలిపారు. ముఖ్య అతిథులుగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, టీడీపీ ధర్మవరం ఇంచార్జి పరిటాల శ్రీరామ్, అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్, హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు చాణక్యరాజ్ హాజరవుతారని తెలిపారు. 13 జిల్లాల బాలికల జట్లు పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు.

867 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 867 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కు 458 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

అయ్యప్పకు బంగారం బిస్కెట్

అజ్ఞాత భక్తురాలి సమర్పణ



హుండీలో లభించిన కాగితం, బంగారు బిస్కట్

అనంతపురం కల్చరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి హుండీలో 10 తులాల బంగారు బిస్కట్ లభించింది. నగరంలోని రామ్‌నగర్ 80 అడుగుల రోడ్డులోని అయ్యప్ప దేవాలయంలో శనివారం ఆలయ నిర్వాహకులు హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టారు. మొత్తం రెండు హుండీల్లో వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. రూ.42,736లు, 10 తులాల బంగారు బిస్కట్ లభించాయి. బంగారం బిస్కట్‌కు చుట్టిన పేపర్‌పై 'ఓం స్వామియే శరణం అయ్యప్ప, అజ్ఞాత భక్తురాలు' అని రాసి ఉంది. ఆలయంలో త్వరలో చేపట్టనున్న విగ్రహ పునఃప్రతిష్ఠాపన నేపథ్యంలో బంగారు కిరీటం, స్వామివారికి బంగారు కవచం చేయించేందుకు దాతల నుంచి విరాళాలు స్వీకరిస్తున్నారు. ఇలాంటి తరుణంలో అజ్ఞాత భక్తురాలు బంగారు బిస్కట్‌ను హుండీలో వేయడం పట్ల ఆలయ కార్యవర్గం హర్షం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, పూజారి వాసు, భక్తులు పాల్గొన్నారు.

వదాన్య అశోక్‌కు అరుదైన గౌరవం



అశోక్‌పడపాటి

కొత్తచెరువు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వదాన్యసొసైటీ ద్వారా ప్రజా సేవ చేస్తున్న అశోక్ పడపాటికి అరుదైన గౌరవం లభించింది. రాజభవన్‌లో ఆదివారం నిర్వహించే గణతంత్ర వేడుకలకు ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానిస్తూ కలెక్టర్ కార్యాలయం ద్వారా సమాచారం పంపారు. కొత్తచెరువు గ్రామానికి చెందిన అశోక్ పడపాటి వదాన్యసొసైటీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో ప్రజాదరణ పొందాయి. విద్యార్థులలో ప్రతిభను వెలికితీయడానికి, యువత ఉద్యోగ అవకాశాలు పొందేందుకు అనేక రకాలైన పోటీ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సామాజిక సేవా కార్యక్రమాలు గుర్తించిన అధికారులు గణతంత్ర వేడుకలకు ఆహ్వానం పంపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

మూడు కిలోల మత్తు పదార్థం స్వాధీనం

రాప్తాడు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రసన్నాయపల్లి రైల్వే గేట్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. రాప్తాడులోని రూరల్ డీఎస్పీ కార్యాలయంలో శనివారం విలేకరులకు ఈ వివరాలను డీఎస్పీ తెలియజేశారు. అనంతపురం సాయినగర్ రెండో క్రాస్‌కు చెందిన పూల సునీల్ కుమార్, నవోదయ కాలనీకి చెందిన పోకల విజయ్‌కుమార్, అంబేడ్కర్ నగర్‌కు చెందిన బండారు శివప్రసాద్, రామకృష్ణ కాలనీకి చెందిన గొల్ల క్రాంతి కుమార్‌రెడ్డి, మంగళవారి కాలనీకి చెందిన బెస్త భాను ప్రకాష్, అనంతపురం రూరల్ మండలం కాటిగానికాలువకు చెందిన ఎర్రగుంట చంద్రకాంత్ రెడ్డి, తాడిపత్రి పట్టణానికి చెందిన మండ్ల కుళ్లాయప్ప బృందంగా ఏర్పడి గంజాయి వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు సీఐ శ్రీహర్ష, పోలీసు సిబ్బంది నిఘా వేసి, నిందితులను శనివారం అరెస్టు చేశారని తెలిపారు. నిందితులను రిమాండుకు తరలించామని తెలిపారు. గంజాయి ముఠాను పట్టుకున్న పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించారని తెలిపారు.

బాలయ్య.. పద్మ భూషణ్

మాడుగుల నాగఫణిశర్మకు పద్మశ్రీ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు



పుట్టపర్తి/పుట్లూరు/అనంతపురం అర్బన్/జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డులలో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం దక్కింది. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పద్మ భూషణ్ పురస్కారానికి ఎంపికయ్యారు. పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన మాడుగుల నాగఫణి శర్మకు పద్మశ్రీ అవార్డు దక్కింది. ఏకకాలంలో సినీ, రాజకీయ రంగాలలో తనదైన ముద్ర వేసిన నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించగానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కళల విభాగంలో ఆయనకు పద్మభూషణ్ పురస్కారం లభించింది. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ వారసుడిగా బాలకృష్ణ వెండి తెరపై సత్తా చాటుకున్నారు. తాతమ్మ కలతో మొదలుపెట్టి 109 జానపద, సాంఘిక, పౌరాణిక, చారిత్రక, సందేశాత్మక చిత్రాలలో ఆయన నటించి మెప్పించారు. రాజకీయాల్లోనూ ఎన్టీఆర్ వారసుడిగా ప్రజా సేవలో ఉన్నారు. 2014లో హిందూపురం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై.. హ్యాట్రిక్ విజయాలు సాధించారు. సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజల అభిమానం చూరగొన్నారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి ఛైర్మన్‌గా సేవలు అందిస్తున్నారు. అర్ధ శతాబ్దపు సినీ ప్రస్థానంలో ఎన్నో విజయాలు సాధించారు. కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు.

కడవకల్లు బిడ్డ..మాడుగుల



పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన మాడుగుల నాగఫణి శర్మకు పద్మశ్రీ పురస్కారం దక్కింది. ఆయన తల్లిదండ్రులు మాడుగుల నాగభూషణ శర్మ, సుశీలమ్మ దంపతులు. 1959లో కడవకల్లులో నాగఫణి శర్మ జన్మించారు. ఈయనకు ఐదుగురు అన్నదమ్ములు, ముగ్గురు అక్క చెల్లెల్లు ఉన్నారు. మొత్తం 9మందిలో నాగఫణి శర్మ రెండో సంతానం. పదో తరగతి అనంతరం, ఆధ్యాత్మికత వైపు మళ్లారు. తర్వాత ఉమ్మడి జిల్లాలోని కడవకల్లు, పుట్లూరు, లేపాక్షి, కడప జిల్లా ప్రొద్దుటూరులో ఈయన చదువు కొనసాగింది. పద్మ పురస్కారానికి ఎంపికైన ఆయనకు బంధుమిత్రులు, గ్రామస్థులు శుభాకాంక్షలు తెలిపారు.

అభిమానుల సంబరాలు

బాలయ్యకు పద్మభూషణ్ పురస్కారం దక్కిందని తెలియగానే ఉమ్మడి జిల్లాలో ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. మంత్రి సవిత, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర్ ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రెండు జిల్లాల అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, కొల్లకుంట అంజినప్ప, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు గాజుల ఆదెన్న, టీడీపీ రాష్ట్ర నాయకులు ఆలం నరసానాయుడు, తలారి ఆదినారాయణ, గౌస్‌మొద్దీన్, గంజె నాగరాజు, మాజీ మేయర్ స్వరూప హర్షం వ్యక్తం చేశారు.

న్యూస్ బాక్స్

ఉత్తమ ఏఈఆర్వోగా అనంతపురం తహసీల్దార్


అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ హరికుమార్

అనంతపురంరూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఉత్తమ ఏఈఆర్వోగా విధులు నిర్వహించిన అనంతపురం తహసీల్దార్ హరికుమార్ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఓటర్ల దినోత్సవంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

మహిళకు బెదిరింపు.. కేసు నమోదు

అనంతపురం క్రైం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓ మహిళ ఫొటోలను ఓ వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టి డబ్బులు డిమాండ్ చేయడంతో అతడిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నగరంలో నివాసమంటున్న ఓ మహిళ భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. గ్యాస్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారు. చెన్నేకొత్తపల్లికి మండలం చిన్నమొగలాయిపల్లికి చెందిన సాయి అఖిల్‌బాబు భాగస్వామిగా ఉండేవాడు. కొన్ని రోజుల క్రితం అఖిల్ ఆమె ఇంటికి వెళ్లాడు. ఆమె ఫొటోలను ఆమెకు తెలియకుండా తీశాడు. వాటిని ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టి...డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో బాధితురాలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య...

సోషల్ వర్కర్‌గా పనిచేసే తాడిపత్రి నిస్సార్ అహ్మద్ (51) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. నగరంలోని మహాత్మా గాంధీకాలనీకి చెందిన నిస్సార్ అహ్మద్ ఈనెల 24వతేదీ నగరంలోని సుభాష్‌రోడ్డులోని రాజధాని లాడ్జిలో ఓ గది అద్దెకు తీసుకున్నాడు. శనివారం ఎంతసేపైనా బయటకు రాకపోవడంతో రూమ్‌బాయ్‌కు అనుమానం వచ్చి మధ్యాహ్నం డోర్ కొట్టాడు. తలుపులు తీయకపోవడంతో వెంటిలేటర్ నుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉన్న నిస్సార్ అహ్మద్ కనిపించాడు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థి అదృశ్యం

నగరంలోని ఓ బీసీ హాస్టల్ నుంచి 14 ఏళ్ల బాలుడు అదృశ్యమయ్యాడు. టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన రమేష్ కుమారుడు మధన్ నగరంలోని రాజేంద్రమున్సిపల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 24వతేదీ ఉదయం 8.30గంటలకు స్కూల్‌కు వెళతానని చెప్పి వెళ్లాడు. కానీ స్కూల్‌కు వెళ్లలేదు. తల్లిదండ్రులకు సమాచారం అందించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా సలహా బోర్డులో అవకాశం ఇవ్వండి

అనంతపురం అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లా సలహా బోర్డులో శారీక దివ్యాంగుల ఉద్యోగుల సంక్షేమ సంఘం తరపున ఒకరికి అవకాశం కల్పించాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ వినోద్‌ను ఆ సంఘం నాయకులు కోరారు. శనివారం ఆ శాఖ కార్యాలయంలో ఏడీని ఆ సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజు, నాగరత్న, నారాయణస్వామి, నాగేశ్వర్‌రెడ్డి, పూర్ణ శంకర్, ఎర్రపరెడ్డి, ఉజ్జినప్ప, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవానంద్‌పై కక్షపూరిత చర్యలు మానుకోవాలి

అనంతపురం సెంట్రల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): దళితులు రాజకీయంగా ఎదగడాన్ని ఓర్వలేని వారు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్‌పై కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నారని వివిధ దళిత సంఘాల నాయకులు మండిపడ్డారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ కేపీ నారాయణస్వామి, జైభీమ్ సేన బీకేఎస్ ఆనంద్, ఎంఎస్ఎఫ్ నగేష్ మాట్లాడారు. దేవానంద్ దళితుల సంక్షేమంకోసం అనేక పోరాటాలు చేశారన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

చెన్నేకొత్తపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజంలో మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని న్యాయవాదులు బాలసుందరీ, భార్గవి పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ మహిళా న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ కవితాదేవి, ఈఓఆర్డీ అశోక్‌నాయక్, వెలుగు ఏపీఎం నాగేంద్ర, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, టింబక్టు కలెక్టివ్ సంస్థ ప్రతినిధి రమీజ పాల్గొన్నారు.

సెమీ కండక్టర్ తయారీలో ఉచిత ఇంటర్న్‌షిప్

అనంతపురం సెంట్రల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): సెమీ కండక్టర్ల తయారీలో విద్యార్థులకు ఉచిత ఇంటర్న్‌షిప్ ఇవ్వనున్నట్లు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి తెలిపారు. శనివారం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) విభాగంలో ఇంటర్న్‌షిప్ ఒప్పంద సమావేశాన్ని నిర్వహించారు. విభాగాధిపతి డాక్టర్ మమత అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశానికి ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సుమలత, రమణారెడ్డి, గిరిప్రసాద్ పాల్గొన్నారు.

కుమ్మర్లకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

అనంతపురం రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అత్యంత వెనుకబడిన కుమ్మర్లకు కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని సత్యసాయి జిల్లా కుమ్మర శాలివాహన సాధికార సమితి కన్వీనర్ రామాంజనేయులు కోరారు. ఈ మేరకు శనివారం బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యంను కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ..ఆదరణ పథకం ద్వారా పనిముట్లు అందించాలన్నారు. కార్యక్రమంలో కుమ్మర శాలివాహన సాధికార కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఓబుళపతి, సంఘం సభ్యులు నారాయణ పాల్గొన్నారు.

దానిమ్మ తోట దహనం

అనంతపురం రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కక్కలపల్లికి చెందిన నరసింహారెడ్డి దానిమ్మ తోట శనివారం కాలిపోయింది. రైతు మాట్లాడుతూ.. గ్రామం సమీపంలోని నాలుగు ఎకరాల్లో 1500 దానిమ్మ మొక్కలు ఏడేళ్ల కిందట సాగు చేసినట్లు తెలిపారు. శనివారం ఉదయం 11గంటల సమయంలో తోట అంటుకుని చెట్లు మొత్తం కాలిపోయాయన్నారు. ఎలా అంటుకుందో తెలియడం లేదన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈసారి పెట్టుబడుల కింద రూ.3 లక్షల వరకు ఖర్చు చేశానని తెలిపారు.


దహనమైన దానిమ్మ తోట

పౌరులందరూ ఓటరుగా నమోదు కావాలి


ఆర్ట్స్ కళాశాలలో ర్యాలీ, రాజ్యాంగ గౌరవ దినోత్సవ ర్యాలీలో బీజేపీ నాయకులు

అనంతపురం సెంట్రల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): భారత పౌరులందరూ ఓటరుగా నమోదు కావాలని ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ వెంకటనాయుడు పిలుపునిచ్చారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలను పలు విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించి అవగాహన ర్యాలీలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎస్కేయూ ఫార్మసీ కళాశాలలో ఏర్పాటుచేసిన వేడుకలకు రెక్టార్ వెంకటనాయుడు హాజరై మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును పొందాలన్నారు. అదేవిధంగా ఆర్ట్స్ కళాశాల, కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞలు చేయించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం దేశానికే గౌరవమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో రాజ్యాంగ గౌరవ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● అనంతపురం కల్చరల్ : భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం అందరం కలిసి పని చేద్దామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో నిర్వహించిన రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ నిర్మల, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, మహాబోధి కృష్ణమూర్తిలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఓతూరు పరమేష్, సిద్దు, రజిత, గిరి, గణేష్, సోము, సాయి పాల్గొన్నారు.

● రాప్తాడు : ఓటు హక్కు ఎంతో విలువైనదని తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం రాప్తాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

● శింగనమల : ఓటు హక్కు కోసం 18 ఏళ్ల నిండిన యువతీయువకులు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య పేర్కొన్నారు. మండలంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అన్ని పాఠశాలలు, కళాశాలలో ముగ్గుల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

విద్యార్థి చావుకు కారణమైన కళాశాలను సీజ్ చేయాలి


నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం విద్య, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థి చావుకు కారణమైన నారాయణ కళాశాలను సీజ్ చేయాలని ఐక్య విద్యార్థి, ఎస్సీ, ఎస్టీ, దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంత్రి నారాయణను మంత్రి వర్గం నుంచి తొలగించాలన్నారు. ఆయన దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా....పోలీసులు అడ్డుకున్నారు. శనివారం ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు క్లాక్ టవర్ వద్ద నిరసనకు దిగారు. కళాశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టేందుకు యత్నించారు. పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాలకు తోపులాట జరిగింది. తర్వాత పోలీసులు దిష్టిబొమ్మను దహనం చేయకుండా లాగేశారు. తర్వాత సంఘాల నాయకులు మాట్లాడుతూ... ఓ విద్యార్థి చనిపోయి రెండు రోజులైనా ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. విద్యార్థులు చనిపోతున్నా...మంత్రి నారాయణకు పట్టడం లేదా అంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కుళ్లాయిస్వామి, పరమేష్, నరేష్, పృథ్వీ, సురేష్, మంజునాథ్, సాకేహరి, హర్ష, సోము, గిరి, కైలాష్ పాల్గొన్నారు.

కూటమి హామీల అమలు కోసం పోరాడుదాం: సీపీఎం


సమావేశంలో మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం కూటమి అధికారంలోకి రాకముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకూ కలిసికట్టుగా పోరాడుదామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పిలుపునిచ్చారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి రాకముందు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని, ప్రజలపై భారాలను తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి నేటికి ఏడు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. అధికారంలోకి రాకముందు ఒక మాట, అధికారం చేపట్టాక ఒక మరో మాట మాట్లాడడం పాలకులకు పరిపాటిగా మారిందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, నాయకులు ముత్తుజ, రామిరెడ్డి, ఆర్‌వి నాయుడు, వెంకటనారాయణ, ప్రకాష్, గోపాల్, ఓబులేసు, రాజు, శీనా, బాలకృష్ణ, గఫూర్, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 50 గొర్రె పిల్లల మృతి

శింగనమల జనవరి 25(ఆంధ్రజ్యోతి): కుక్కలు దాడిచేయడంతో శింగనమలలో 50 గొర్రె పిల్లలు మృతి చెందాయి. శింగనమలకు చెందిన గొర్రెల కాపరి గొల్ల చలమయ్య ఊరికి సమీపంలో గొర్రెల మంద వేశాడు..శనివారం ఉదయం గొర్రెలను మేత కోసం గొర్రెపిల్లలను మంద వేసే చోటు ఇనుప కంచ వేసి గొర్రెలను మేతకు తీసుకుని వెళ్లారు. ఇనుప కంచెలో వేసిన 60 గొర్రెపిల్లపై కుక్కలు దాడి చేయడంతో 50 పిల్లలు మృతి చెందగా..10 పిల్లలు తీవ్రంగా గాయపడ్డాయి... కాపరికి దాదాపు రూ.2.5 లక్షలు నష్టం వాటిల్లింది.

రహదారి నిబంధనలు పాటించాలి

రాప్తాడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు. రాప్తాడులోని ఆటో నగర్‌లో శనివారం లారీ అసోషియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించి రహదారి నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● గార్లదిన్నె : హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా, ఎంవీఐ మనోహర్‌రెడ్డి వాహనదారులకు సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా శనివారం కల్లూరు వద్ద 44వ జాతీయ రహదారిపై వాహనదారులకు అవగాహన కల్పించారు.

మహిళపై దాడి

గార్లదిన్నె, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో అనురాధ అనే మహిళపై ఆదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సాయి, తల్లి సావిత్రి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు మేరకు మర్తాడుకు చెందిన శనివారం సాయంత్రం ఆటో డ్రైవర్ సాయి, తల్లి సావిత్రి అనురాధ ఇంట్లోకి వెళ్లి దాడి చేసి తీ వ్రంగా గాయపరిచారు. ఆటో డ్రైవర్ సాయి, తల్లి సావిత్రిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పీవీకేకేలో ముగిసిన సాంకేతిక సదస్సు

అనంతపురంరూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలో గత రెండురోజులుగా జరుగుతున్న సాంకేతిక సదస్సు శనివారం ముగిసింది. కళాశాలలో ఆప్టిట్యూడ్ అండ్ లాజికల్ రీజనింగ్ స్కిల్స్‌పై సాంకేతిక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఐకేర్ అకాడమీ ఫౌండర్ దుర్గా నాగేష్, టెక్నికల్ అసోసియేట్ గురుదత్ ప్రధాన వక్తలుగా హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, విభాగాధిపతి దిలీప్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ధరణి పాల్గొన్నారు.

మహిళల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మహిళల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో కార్యవర్గసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల మహిళల జీవితాల్లో వెలుగు నింపడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను తీసుకువస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం సత్యనారాయణ, ఐబీ ఏపీఎం అనిత, జిల్లా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు సుశీలా, రాధమ్మ, ఉపాధ్యక్షురాలు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత నగరోత్సవం

అనంతపురం కల్చరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వాసవీమాత దీక్షా మండలాన్ని పురస్కరించుకుని వాసవీ దీక్షాసమితి, కొత్తూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం వాసవీమాత నగరోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగించారు. భక్తులు కోలాటం, నృత్యాలు, భజన ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు, వాసవీ దీక్షాసమితి అధ్యక్షుడు సుకుమార్ గుప్త పాల్గొన్నారు.


నగరోత్సవం ముందు నృత్యాలు చేస్తున్న మహిళలు

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా గంగారామ్


గంగారామ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా టీడీపీ నాయకుడు గంగారామ్ నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ నాయకులు ఆయనకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ.. నాణ్యమైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో నాయకులు బుగ్గయ్య చౌదరి, పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వరన్, కొండన్న, సరిటిపూటి రమణ, హరి, ముక్తియార్, బాలకృష్ణ, గోపాల్ గౌడ్, మధు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు రానివ్వొద్దు : ఎమ్మెల్యే

వేసవి సమీపిస్తోంది.. నగరంలో ఎక్కడా విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. శనివారం తన క్యాంప్ కార్యాలయంలో ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్, డీఈ రమేష్, ఏడీలతో ఆయన సమావేశమయ్యారు. మీ ఇంటికి - మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో విద్యుత్ సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు.

గొర్రెల మేకల సొసైటీల ఎన్నికలు ఏకగ్రీవం

అనంతపురంరూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలపల్లి గొర్రెల మేకల సొసైటీకి ఎన్నికల అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం ఎన్నిక నిర్వహించారు. సొసైటీ చైర్మన్‌గా బండి పోతులయ్య, ఉపాధ్యక్షుడిగా పారేశ, సభ్యులుగా బి. ఏకాంత్, ఆంజనేయులు, వీరన్న, పెద్దయ్య, ఈశ్వరయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు రాగే మురళీమోహన్, ప్రసాద్, ఓబిరెడ్డి, రామచంద్ర, పోతులయ్య, పెద్దన్న, బాబు, రవి, వెంకటస్వామి పాల్గొన్నారు.

● కనగానపల్లి : మండలంలోని యలక్కుంట్ల, నరసంపల్లి గ్రామాల్లో నూతన గొర్రెల సొసైటీ పాలకవర్గ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. యలక్కుంట్లకు అధ్యక్షుడిగా పరమేశప్ప, ఉపాధ్యక్షుడిగా ముత్యాలు, ఆదినారాయణ, భార్గవతో పాటు ఐదుగురు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధికారులు తెలిపారు.

● చెన్నేకొత్తపల్లి : మండలంలోని గంగినేపల్లిలో గొర్రెల పెంపకందారుల సంఘం ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా చీమల చెన్నుడు, ఉపాధ్యక్షుడిగా కేశప్ప, డైరెక్టర్లుగా పెద్దచెన్నప్ప, శంకరయ్య, మల్లేశ్, ఒంటికొండ చెన్నుడు, అక్కులప్పను ఎన్నుకున్నట్టు తెలిపారు.

నిలిచిన మదిగుబ్బ గొర్రెలు సొసైటీ ఎన్నిక

ఆత్మకూరు : మండల పరిధిలోని మదిగుబ్బ గొర్రెలు సొసైటీ ఎన్నిక శనివారం వివాదాస్పదం కావడంతో ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. మదిగుబ్బ సొసైటీలో 150 మంది సభ్యులు ఉన్నారు. కొత్తగా ఎలాంటి అనుమతులు లేకుండా సభ్యులను చేర్చినట్లు టీడీపీ వర్గీయులు అధికారులపై మండి పడ్డారు. వారి ఫిర్యాదుతో విచారించి మరోసారి ఎన్నిక నిర్వహిస్తామని వాయిదా వేశారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించండి

అనంతపురం విద్య, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఉత్తీర్ణత శాతం పెరిగేలా చూడాలని ఏపీసీ శైలజ కేజీబీవీ ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. 'కేజీబీవీల పర్యవేక్షణ గాలికి' శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనికి సమగ్రశిక్ష ప్రాజెక్టు ఏపీసీ శైలజ స్పందించారు. శనివారం సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో 32 కేజీబీవీల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఎక్కడా ఏ సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. పది, ఇంటర్ పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో సీ, డీ కేటగిరీ విద్యార్థులు పాసయ్యేలా ప్రణాళికతో ముందకెళ్లాలన్నారు. పరీక్షల ఫలితాల్లో ప్రతి మండలంలో ఉత్తమ మార్కులతో టాప్‌లో నిలిచే ప్రతి 5 మంది విద్యార్థుల్లో కనీసం ముగ్గురు కేజీబీవీ విద్యార్థులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా ఏపీసీ రాప్తాడు కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటుకు కృషి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి హామీ


హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న బీఎల్ఎఫ్ నాయకులు

అనంతపురం సెంట్రల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కోర్టుల ప్రాంగణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా కృషిచేస్తానని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసులు హామీ ఇచ్చినట్లు బహుజన లాయర్స్ ఫోరం(బీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు బానాసి నారాయణప్ప తెలిపారు. శనివారం జిల్లాకు వచ్చిన ఆయనను రోడ్లు, భవనాల అతిథిగృహంలో బీఎల్ఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఎల్ఎఫ్ నాయకులు అజీజ్, మహేశ్వరి, శ్రీనివాసులు, ప్రమీల, రవికుమార్, జగదీష్, మారెప్ప, రామాంజినేయులు పాల్గొన్నారు.

● అనంతపురంరూరల్: మండలంలోని కొడిమి వద్ద ఉన్న ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ అధినేత చిరంజీవిరెడ్డి, పాఠశాల విద్యార్థులు హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీనివాసరెడ్డిని కలిశారు. జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు విద్యార్థులు పుష్పగుచ్ఛాలు అందజేసి దేశభక్తి గేయంతో స్వాగతం పలికారు.

సూపర్‌సిక్స్ అమలులో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

అనంతపురం న్యూటౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ అమలులో కూటమి ప్రభుత్వం విఫలమయిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, అనంతపురం ఇన్‌చార్జ్ దాదాగాంధీ మండిపడ్డారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు.. శనివారం కలెక్టర్ కార్యాలయం వద్ద థాలీ భజావో పేరుతో నిరసన చేపట్టారు. ప్లేట్లతో పెద్ద ఎత్తున శబ్దం చేస్తూ, కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సూపర్ సిక్స్ అమలు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చి ఇప్పుడు పట్టించుకోలేదన్నారు. ఇప్పటి వరకు పింఛన్, గ్యాస్ మాత్రమే అమలు చేశారని గుర్తు చేశారు. దాదాగాంధీ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా మూలన పడేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, ఇమామ్, హరిరాయల్, కృష్ణా, కొండారెడ్డి, ఓబిలేసు పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్ ఎస్ఐగా దండు నగేష్


డీఐజీని కలిసిన ఎస్ఐ దండు నగేష్

అనంతపురం కల్చరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అనంతపురం ఇంటెలిజెన్స్ విభాగం ఎస్ఐగా దండు నగేష్ బాధ్యతలు చేపట్టారు. 3వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న నగేష్ ఎస్ఐగా పదోన్నతిపై ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కర్నూలు, అనంతపురం జిల్లాల ఇన్‌చార్జి డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. దండు నగేష్ 1989లో పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. ఆయన పదోన్నతిపై బదిలీ పొందిన నేపథ్యంలో శనివారం ఉదయం త్రీటౌన్ పోలీసులు ఘనంగా వీడ్కోలు పలికారు.

ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఢిల్లో నిర్వహించే గణతంత్ర వేడుకల్లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు పాల్గొంటున్నట్లు శనివారం ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు నవీన్‌కుమార్, శివశంకర్, ఈశ్వర్ ఢిల్లీ వెళ్లారని వివరించారు.

థ్యాంక్యూ సీఎం సర్..!


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): తమకు ప్రత్యేకంగా మద్యం దుకాణాలను కేటాయించినందుకు సీఎం చంద్రబాబుకు కల్లుగీత కార్మికులు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ అనంతపురం అర్బన్ కార్యాలయం వద్ద పార్టీ నాయకుడు గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ హజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, శ్రీనివాసులు గౌడ్, నాగభూషణం గౌడ్, శంకర్, వెంకటేష్, సరిపూటి రమణ, కూచి హరి, చేపల హరి తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పురాతన ఆలయాల్లో ఒకటైన అనంతపురం మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సాకే రమేష్‌బాబు తెలిపారు. శనివారం ఆలయ ఆవరణలో బహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. రోజుకొక వాహనసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రతిభ

అనంతపురం విద్య, జనవరి 25(ఆంధ్రజ్యోతి): క్యాట్ 2వ లెవల్‌లో అనంతపురం జిల్లా జోన్ శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ చూపారు. ఈ మేరకు శనివారం ఏజీఎం సుబ్బారెడ్డి విద్యార్థులను కమ్మభవన్ సమీపంలో శ్రీచైతన్య స్కూల్‌లో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ.. డిసెంబర్‌లో నిర్వహించిన క్యాట్ 2వ లెవల్ పరీక్షల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున ప్రతిభ చూపారన్నారు.

Celebrate Republic Day with a

WINNING SHOPPING EXPERIENCE

విజేత Fresh Healthy Living ®

Thank You For Gracing Our Opening Ceremony!

Shri Daggupati Venkata Prasad	Shri Ambica Laxminarayana	Shri B K Parthasarathi	Shri Paritala Sriram	Shri MS Raju
MLA Ananthapur	Member of Parliament Ananthapur	Member of Parliament Hindupur	TDP Incharge - Dharmavaram Constituency	Madakasira MLA & TTD Board Member

On Purchase of ₹999/- Get VIJETHA PREMIUM SUGAR 1KG ₹52/- FREE

OFFERS VALID ON 26th JANUARY 2025 ONLY.

Freedom Sunflower Oil 5L Jar
Vijetha Premium Sugar 1kg
Aashirvaad Whole Wheat Atta 5+1kg
MRP. 1337/- VIJETHA PRICE ₹1089 ONLY SAVE ₹248

OFFERS VALID ON 26th JANUARY 2025 ONLY.

Product	Details	Offer
TOMATO LOCAL	PER KG Vijetha Price	₹9
CABBAGE	PER KG Vijetha Price	₹15
CAULIFLOWER	PER PC Vijetha Price	₹15
KADDU (BOTTLE GOURD)	PER KG Vijetha Price	₹19
POTATO	PER KG Vijetha Price	₹29
ONION RED	PER KG Vijetha Price	₹29
KIWI FRUIT REGULAR	PER PC Vijetha Price	₹29
VIJETHA WHOLE WHEAT ATTA 1KG / 5KG	MRP ₹ 90/445 Vijetha Offer	BUY 1 GET 1 FREE
BASMATHI RICE LOOSE	PER KG Vijetha Price	₹89
SUGAR LOOSE	PER KG Vijetha Price	₹39
URAD ROUND LOOSE	PER KG Vijetha Price	₹119
TOOR DAL LOOSE	PER KG Vijetha Price	₹139
IDLY RAWA LOOSE	PER KG Vijetha Price	₹39
TSF MILK BREAD 450G/ PAV BUN /CAKE 200G/ MUFFINS / DONUT 160G (SELECTED RANGE)	Vijetha Offer	BUY 1 GET 1 FREE
AADHAAR SUNFLOWE OIL 1LTR POUCH	MRP ₹ 160 Vijetha Price	₹135 ONLY
FORTUNE SUNFLOWER OIL 1LT POUCH	MRP ₹ 165 Vijetha Price	₹139 ONLY
ORIGINAL KIMIA DATES / ELEPHANT DATES KIMJO / ASRA KIMIA DATES 400G BOX	Vijetha Offer	BUY 1 GET 1 FREE
JERSEY DOODH PEDA 190G/ BADAM MILK 185ML PET	MRP ₹ 40-199 Vijetha Offer	BUY 1 GET 1 FREE
SUNFEAST YIPPEE NOODLES MAGIC MASALA 420G	MRP ₹ 90 Vijetha Offer	₹35 OFF ON MRP
SUNFEAST MOMS MAGIC CASHEW & ALMOND COOKIES 94.5G	MRP ₹ 35 Vijetha Offer	BUY 1 GET 1 FREE
3ROSES NATURAL CARE TEA POWDER 500G	MRP ₹ 470 Vijetha Offer	₹35 OFF ON MRP
BOOST REGULAR 750G POUCH / HORLICKS PLAIN 750G REFILL	MRP ₹ 469/459 Vijetha Offer	₹100 OFF ON MRP
SUNFEAST DARK FANTASY CHOCO FILLS 600G	MRP ₹ 350 Vijetha Offer	BUY 1 GET 1 FREE
COCO ROYAL BASIL SEED 290ML (ENTIRE RANGE)	MRP ₹ 99 Vijetha Offer	BUY 1 GET 1 FREE
BRU INSTANT COFFEE POWDER 200G POUCH	MRP ₹ 600 Vijetha Offer	₹50 OFF ON MRP
REXONA SOAP COCONUT& OLIVE 150G*3PC SET	MRP ₹ 267 Vijetha Offer	₹75 OFF ON MRP
PEARS SOAP PURE & GENTLE 125G-B4G1 FREE SET	MRP ₹ 372 Vijetha Offer	₹100 OFF ON MRP
DOVE BEAUTY BATHING BAR CREAM 125G*3PC SET	MRP ₹ 249 Vijetha Offer	₹50 OFF ON MRP
PEPSODENT 2IN1 TOOTH PASTE 150G*2 PACK	MRP ₹ 250 Vijetha Offer	BUY 1 GET 1 FREE
PARACHUTE COCONUT OIL 600ML	MRP ₹ 296 Vijetha Offer	₹75 OFF ON MRP
SUNSILK SHAMPOO STUNNING BLACK SHINE 650ML	MRP ₹ 809 Vijetha Offer	BUY 1 GET 1 FREE
CLINIC PLUS SHAMPOO STRONG & LONG 355M	MRP ₹ 328 Vijetha Offer	₹76 OFF ON MRP
SURF EXCEL SOAP 200G*4PC SET	MRP ₹ 125 Vijetha Offer	₹15 OFF ON MRP
VIM SOAP ANTI SMELL WITH PUDINA 200G*5PC SET	MRP ₹ 130 Vijetha Offer	₹20 OFF ON MRP
TRELLIS INSPIRATION FLAT TAWA FT 285	MRP ₹ 1195 Vijetha Price	₹599 ONLY

OFFERS VALID ON 26th JANUARY 2025 ONLY. VISIT OUR STORE FOR MANY MORE OFFERS

scan for location

Vijetha Supermarkets Pvt. Ltd.

Telangana • Andhra Pradesh

Maruthi Nagar 80 Feet Road Opp. Y.V Shiva Reddy House, Beside Mythrivanam Hotel, Anantapur, Andhra Pradesh - 515001. Ph.: 91543 63466 vijethasupermarkets VijethaSuperMarketsPvtLtd

SINCE 1999 In Customer Service

రథసప్తమి పోస్టర్ల ఆవిష్కరణ

ఉరవకొండ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం రథసప్తమి పోస్టర్లను విడుదల చేశారు. ఆలయ ఈఓ రమేష్, అర్చకుడు ద్వారకనాథాచార్యులు, టీడీపీ నాయకులు కలిసి ఆవిష్కరించారు. ఫిబ్రవరి 6వ తేదీన రథసప్తమిని పురస్కరించుకుని స్వామివారి కల్యాణోత్సవంను నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. రథసప్తమి రోజున సూర్య ప్రభ, హనుమంత, గరుడ, గో వాహనోత్సవాలు జరపనున్నామన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. టీడీపీ నాయకులు రేగాటి నాగరాజు, విజయ్‌భాస్కర్, మారెన్న, నెట్టెంరాంబాబు, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ పాల్గొన్నారు.

కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

రాయదుర్గం రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థి చావుకు కారణమైన నారాయణ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ రాష్ట్రకమిటీ సభ్యుడు బంగి శివ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని వినాయకసర్కిల్ వద్ద శనివారం విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అనంతపురం నగరంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్ అనే విద్యార్థి గత గురువారం భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. విద్యార్థి మృతికి కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆ విద్యాసంస్థలకు వత్తాసుగా పనిచేస్తున్న ఆర్ఐఓ వెంకటరమణనాయక్‌ను సస్పెండ్ చేయాలన్నారు. లేని పక్షంలో దశలవారీగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ జిల్లా నాయకులు అనిల్, రాజు, తరుణ్, భాను, పవన్‌రాజు, వలి, అనిల్, గణేష్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కేసు నమోదు

తాడిపత్రి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): తనను ప్రేమించాలని ఓ విద్యార్థినిని వేధిస్తుండడంతో మహబూబ్‌బాషా అనే యువకుడిపై శనివారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఓ కాలనీకి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థినిని పాఠశాలకు వెళ్లే సమయంలో తనను ప్రేమించాలని స్థానిక మెయిన్‌బజారుకు చెందిన మహబూబ్‌బాషా వేధించేవాడు. దీంతో ఆ విద్యార్థిని విషయాన్ని తల్లికి చెప్పడంతో ఆమె ఫిర్యాదు తమకు ఫిర్యాదు చేసిందని, ఆ మేరకు కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి


పుల్లయ్య (ఫైల్)

పుట్లూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులాపురం గ్రామంలో పుల్లయ్య (45) అనే రైతు అరటితోటలో గుండెపోటుతో మృతి చెందాడు. పుల్లయ్య తనకున్న మూడు ఎకరాలతో పాటు మరో నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని అరటి పంటను సాగుచేస్తున్నాడు. కాగా శనివారం ఉదయాన్నే తోటకు వెళ్లిన ఆయన ఛాతిలో నొప్పి కావడంతో కింద పడిపోయాడు. గమనించిన భార్య వెంటనే తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు రైతుల మరణాలను నివారించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బొమ్మనహాళ్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురవళ్లి గ్రామ శివారులో పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. అందిన సమాచారం మేరకు కురవళ్లి గ్రామ సమీపంలో గల పేకాటకేంద్రంపై సిబ్బందితో కలిసి దాడులు చేశామని, అందులో పేకాటాడుతున్న ఆరుగురిని అరెస్టు చేశామని చెప్పారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 7100 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రాయదుర్గం కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవతో రైతులకు సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేశారు. పట్టణంలోని శనివారం విద్యుత్ డీఈ శేషాద్రి శేఖర్, ఏడీ గురురాజు, టీడీపీ సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున ఆధ్వర్యంలో రైతులకు దాదాపు 50 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి, తెలుగు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీ నారాయణ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ నీలాస్వామి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా మండల సమావేశం

బెళుగుప్ప, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధిని సాధిద్దామంటూ ఎంపీపీ పెద్దన్న పేర్కొన్నారు. బెళుగుప్ప సమీపంలో ప్రభుత్వ భూమి 50 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైందని, విచారించి చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ నాయకులు అధికారులను కోరారు. దుద్దేకుంట, బెళుగుప్ప గ్రామాల్లో కందుల కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, రైతులు వినియోగించుకోవాలని ఏవో పృథ్వీసాగర్ తెలిపారు. ఎంపీడీవో లక్ష్మీ నారాయణ, ఎంఈవో మల్లారెడ్డి, ఈవోఆర్డీ నాగేశ్వరశాస్త్రి, ఎంపీపీ పుష్పావతి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మూడిళ్లల్లో చోరీ

యల్లనూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో దొంగలు మూడిళ్లల్లో చొరబడి సుమారు రూ.1.50లక్షల విలువగల బంగారు, నగదును దోచుకెళ్లారు. పాతపేటలోని ఎస్సీకాలనీలో పుల్లమ్మ ఇంటికి తాళం పగలగొట్టి ఇంటిలో ఉన్న డిస్కో పూసలదండ, ఒక జత కమ్మలు, నాలుగు వెండి ఉంగరాలు, రూ.4500నగదు దోచుకెళ్లారు. అదేవీధిలో నివాసం ఉంటున్న ప్రహ్లాద ఇంటికి తాళం వేసి పులివెందులకు వెళ్లారు. ఆ ఇంటి తాళం కూడా పగలగొట్టి రూ.45వేలు దోచుకెళ్లారు. బీసీకాలనీలో కొత్తమిద్దె మనోహర్ ఇంటికి కూఆ తాళం పగలగొట్టి రెండు జతల బంగారు కమ్మలు, రూ.40వేలకు పైగా నగదు చోరీ చేశారు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాలను పరిశీలించారు. వెంటనే క్లూస్‌టీంను రప్పించి వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేస్తున్నట్లు తెలిపారు.

మహిళను కాపాడిన యువకులకు సన్మానం


యువకులను సన్మానిస్తున్న పోలీసులు

ఉరవకొండ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీలో కొట్టుకు పోతున్న మహిళను ప్రాణాలకు తెగించి కాపాడిన బెళుగుప్పకు లింగప్ప, ఎర్రిస్వామిని పోలీసులు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో శనివారం సీఐలు చిన్నగౌస్, మహానంది ఆ యువకులకు పూలమాలలు వేసి, శాలువా కప్పి సత్కరించి అభినందించారు. ఈ నెల 22వ తేదీన రాయంపల్లి సమీపంలోని హెచ్చెల్సీలో సునీత అనే మహిళ బట్టలు ఉతికేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ కాలువలో పడింది. ఆ సమయంలో అటుగా బైక్‌పై వెళ్తున్న ఆ యువకులు గమనించి కాలువలోకి దూకి ఆమెను కాపాడారు. ప్రాణాలను కూడా లెక్క చేయకుండా సాహసోపేతంగా మహిళను కాపాడారని సీఐలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ జనార్ధన్‌నాయుడు, ఏఎస్ఐ శివ, హెడ్ కానిస్టేబుల్ అంజి, కానిస్టేబుల్ ఓబులేశు పాల్గొన్నారు.

మంచు తెరలను చీల్చుకుంటూ.. భానోదయం..


కంబదూరులో తోటల్లో కమ్మేసిన పొగమంచు


మంచు తెరలను చీల్చుకుంటూ ఉదయిస్తున్న భానుడు

కళ్యాణదుర్గం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పలుచోట్ల ఇంకా పొగమంచు దట్టంగా కమ్మేస్తోంది. దీంతో అక్కడి వీధులు, రోడ్లు కనపడడం లేదు. ఉదయం 8 గంటలవుతున్నా.. మంచు వీడటం లేదు. దీంతో ప్రజలు ఎండ కాసేవరకు బయటికి రాలేకపోతున్నారు. వాహనదారులైతే లైట్లు వేసుకుని మరీ నెమ్మదిగా ముందుకు సాగాల్సి వస్తోంది. గ్రామాల్లో అయితే పొలాలు పొగమంచుతో కప్పబడి ఉండడం చూపరులకు కనువిందు చేస్తోంది. కంబదూరు మండల కేంద్రంలో శనివారం ఉదయం 8 గంటలైనా పొగమంచు దట్టంగా కమ్ముకుంది. వ్యవసాయ తోటలు మంచు కౌగిట్లో ఉండిపోయాయి. ఆ మంచు తెరలను చీల్చుకుంటూ.. సూరీడు ఉదయించే దృశ్యం చూపరులకు ఆహ్లాదాన్ని నింపింది.

స్మార్ట్‌వర్క్‌తో అద్భుత ఫలితాలు సాధించొచ్చు: విప్ కాలవ


అభ్యర్థులకు మెటీరియల్‌ను అందిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం/రూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విధానంలో సమయ విభజన చేసుకొని స్మార్ట్‌వర్క్ చేసుకుంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని బీఈడీ అభ్యర్థులకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని శిక్షణ శిబిరంలో దాదాపు నాలుగునెలల పాటు కోచింగ్ తీసుకున్న టెట్, బీఈడీ అభ్యర్థులకు శనివారం ఆయన దిశానిర్దేశం చేశారు. అత్యుత్తమ అనుభజ్ఞుల చేత బీఈడీ అభ్యర్థులకు ఉత్తమ శిక్షణ ఇప్పించాలన్న తన సంకల్పం నెరవేరిందన్నారు.ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా ఉద్యోగం పొందాలన్నదే తన ఆకాంక్ష అని చెప్పారు. అనంతరం శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు మెటీరియల్‌ను అందజేశారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి..

సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాలవఅన్నారు. పట్టణ సమీపంలో డ్వామా కార్యాలయంలో ఇంజనీరింగ్ అసోషియేషన్ డైరీని ఆవిష్కరించారు. పీఆర్ ఎస్సీ అస్లాం బాషా, డీఈ సుధాకర్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఐదు మండలాల ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు, పీఆర్ జేఈలతో పాటు ఇంజనీరింగ్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు మైలారప్ప సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే అమిలినేని


సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : బెంగళూరులో ప్రతి ఏటా టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించే సంక్రాంతి వేడుకలు ఈ సారి శనివారం జరిగాయి. ఇందులో సీఎం సతీమణి నారా భువనేశ్వరితో కలిసి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కూడేరు జనవరి25 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు నారాయణమ్మ(80) చికిత్స పొందుతూ మృతి చెందింది. గార్లదిన్నె మండలం బూడేదు గ్రామానికి చెందిన దుర్గం నారాయణమ్మ కూడేరు మండలం పి.నాగిరెడ్డిపల్లిలో కుమార్తె ఇంటికి సంక్రాంతి పండగకు వచ్చింది. అయితే ఈనెల 22వ తేదీన సాయంత్రం చలి మంట వద్ద ఉండగా.. చీరకు నిప్పంటుకోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వెంటనే అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలు కుమార్తె లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వారు చెప్పారు.

వీఆర్వోకు ఉత్తమ బీఎల్ఓ అవార్డు


అవార్డు అందుకున్న వీఆర్వో అంజలి

కణేకల్లు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గ్రేడ్ 2 వీఆర్వోగా పనిచేస్తున్న అంజలికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ బీఎల్ఓగా అవార్డు వచ్చినట్లు తహసీల్దార్ ఫణికుమార్ తెలిపారు. విజయవాడలో శనివారం జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్‌తో పాటు అంజలి కూడా అవార్డు అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కణేకల్లు బీఎల్ఓగా ఉండి రాష్ట్రస్థాయిలో అవార్డు పొందడం హర్షణీయమన్నారు.

రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలి: ఏఎస్పీ


యాడికిలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఏఎస్పీ తదితరులు

యాడికి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు నిబంధనలను తప్పక పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి సూచించారు. మండలకేంద్రంలో శనివారం ఆయన రోడ్డుభద్రతా నిబంధనలపై సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్విచక్రవాహనాల్లో ట్రిబుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, పరిమితికి మించి వేగంతో ప్రయాణం చేయడం నేరమని తెలిపారు. ప్రమాద రహిత ప్రాంతాలుగా మార్చడానికి వాహనదారుల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. ర్యాలీలో సీఐ ఈరన్న, ఎస్ఐ వెంకటరమణ, ఏఎస్ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణ సమీపంలోని కొత్తబ్రిడ్జి వద్ద ఏఎస్పీ ప్రయాణికులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట పట్టణ సీఐ సాయిప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

పెద్దపప్పూరు: మండలకేంద్రంలోని డప్పుకళాకారులతో రోడ్డు నిబంధనలపై పాటల రూపంలో ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ప్రజలకు అవగాహన కల్పిచారు. గ్రామస్థులు, వాహనదారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరించాల్సిందే: ఆర్డీఓ

యాడికి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను వందశాతం పరిష్కరించాల్సిందేనని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ తెలిపారు. యాడికి రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల గ్రామాల్లో చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి అర్జీల రూపంలో వచ్చిన సమస్యల్ని వందశాతం పరిష్కరించడానికి సిబ్బంది కృషిచేయాలని తెలిపారు. యాడికి మండలంలో ప్రజల నుంచి మొత్తం 370దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో ఇదివరకే 95దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. మిగిలిన వాటిని 45రోజుల్లోపు పరిష్కరించేలా చూస్తామని అన్నారు. తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐలు పాల్గొన్నారు.

అర్హులు ఓటు హక్కు కలిగి ఉండాలి


గుంతకల్లులో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

అర్హులందరూ ఓటుహక్కును కలిగి ఉండాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని రెవెన్యూ అధికారులు పలు పాఠశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులచేత ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. ఆర్డీఓ కార్యాలయంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ నయామ్ అహ్మద్, ఎంపీపీ మాధవి, వీఆర్వోలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో వేర్వేరుగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మహబూబ్ బాషా, వైస్ ప్రిన్సిపాల్ మస్తానప్ప, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మమత పాల్గొన్నారు. శెట్టూరు మండల వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి , ఎంపీడీవో రఘురామారావు పాల్గొన్నారు. బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, తాడిపత్రి, పెద్దవడుగూరు తదితర ప్రాంతాలలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు.

ప్లీజ్ అంకుల్.. సాయం చేయండి

● డబ్బు సంపాదనకు జులాయి వినూత్న మార్గం

తాడిపత్రి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): 'ప్లీజ్ అంకుల్..! మావాళ్లు ఆస్పత్రిలో ఉన్నారు. నావద్ద డబ్బులు లేవు. ఎంతో కొంత సాయం చేయండి. ఈ నెంబర్‌కు ఫోన్ పే చేయండి'. ఇదీ జులాయిగా తిరిగే ఓ యువకుడు సులభంగా డబ్బు సంపాదించడానికి ఎంచుకున్న మార్గం. కొన్ని రోజులుగా అందరినీ మాయ చేస్తున్న ఈ యువకుడు శనివారం పోలీసులకు చిక్కాడు. పట్టణంలోని కేవీరెడ్డి నగర్‌కు చెందిన మహబూబ్ బాషా జులాయిగా తిరుగుతూ వ్యసనాలకు బానిసయ్యాడు. విద్యార్థులను టార్గెట్ చేసుకొని కథ నడిపించాడు. పాఠశాలలకు వెళ్లే, వదిలే సమయాల్లో విద్యార్థులను మచ్చిక చేసుకొని వారి తల్లిదండ్రులకు తన ఫోన్ ద్వారా కాల్ చేయిస్తాడు. మొదట విద్యార్థి మాట్లాడిన తర్వాత తల్లిదండ్రులతో మహబూబ్‌బాషా నేరుగా మాట్లాడతాడు. నేను మీ పిల్లవాడి స్నేహితుడిని అని, తన తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగాలేదని, వైద్యం చేయించడానికి తన వద్ద డబ్బులు లేవని, సాయం చేయమని నమ్మబలుకుతాడు. దీంతో తమ పిల్లవాడి స్నేహితుడే కదా వారు డబ్బులు ఇస్తుంటారు. ఇప్పటికే పుట్లూరు మండలంలో ఒకరు, తాడిపత్రి పట్టణానికి చెందిన ఐదారుగురు, పెద్దపప్పూరు మండలానికి చెందిన ఒకరిద్దరు ఫోన్‌పే ద్వారా డబ్బులు మహబూబ్‌బాషాకు పంపించారు. ఈ మొత్తం దాదాపు రూ.50వేల వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. మహబూబ్‌బాషా రోజు మాదిరిగానే శనివారం కూడా ఓ పాఠశాలకు వెళుతున్న విద్యార్థి వరుణ్‌కుమార్‌ను ఆపాడు. అనంతరం ముందులాగానే తండ్రికి ఫోన్ చేయించాడు. కానీ ఆ విద్యార్థి తండ్రి ఓబిరెడ్డికి అనుమానం వచ్చింది. నువ్వు ఎక్కడ ఉన్నావ్ చెప్పు నేను వస్తాను అనిచెప్పాడు. లేదు అంకుల్ ఫోన్ పే చేయండి. త్వరగా ఆసుపత్రికి వెళ్లాలని ఓబిరెడ్డిని కోరాడు. కుమారుడు ఉన్న ప్రదేశానికి సమీపంలోనే ఓబిరెడ్డి ఉండటంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. అంతలోనే మహబూబ్‌బాషా అక్కడి నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న ఓబిరెడ్డి పోలీసులకు సమాచారం అందించాడు. సీఐ సాయిప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. అనంతరం మహబూబ్‌బాషాను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఓబిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

స్టీరింగ్ రాడ్ విరిగి.. రైలు పట్టాల మధ్య ఆగిన లారీ

గుంతకల్లు టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణ సమీపంలోని బళ్లారి గేట్ వద్ద శనివారం రాత్రి లారీ సిర్టింగ్ రాడ్ విరిగి రైలు పట్టాల మధ్య ఆగిపోయింది. గుంతకల్లు-అనంతపురం మార్గంలో ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. నెల్లూరు నుంచి లోడ్‌తో గుల్బర్గాకు వెళుతున్న లారీ బళ్లారి గేట్ రైలు పట్టాలపైకి రాగానే స్టిరింగ్ రాడ్ విరిగిపోయింది. పట్టాల మధ్యలో లారీ నిలిచిపోయింది. అదే సమయంలో బెంగళూరు నుంచి కలబుర్గి వెళ్లే వందేభారత్ రైలు ఆ మార్గంలో వస్తోందని తెలిసి గేట్‌మన్ అప్రమత్తమయ్యారు. లోకో పైలెట్‌కు సమాచారం అందించారు. ఆ తరువాత రెడ్ టార్చ్ చూపించుకుంటూ పట్టాలపై ముందుకు వెళ్లాడు. ఈ ఘటనతో వందేభారత్ రైలు అరగంట నిలచిపోయింది. లారీ స్టీరింగ్ మరమ్మతు చేసిన తరువాత ముందుకు కదిలింది. ఆ తరువాత వందేభారత్ రైలు బయలుదేరింది. రహదారిపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది.

కనబడాలి మరి..!


ప్లకార్డులతో మోకాళ్లపై కూర్చొన్న విద్యార్థులు

పుట్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఓటు విలువను తెలియజేసే ప్లకార్డులను ప్రదర్శించారు. డిప్యూటీ తహసీల్దారు మల్లేష్ ప్రసాద్, హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అంతా బాగానే ఉన్నా, చివరలో ఫొటో దిగేందుకు ఇలా విద్యార్థులను మోకాళ్లపై నిలబెట్టారు. ప్లకార్డులు, మాస్టార్లు ఫొటోలో కనబడేందుకు బాలలు కాసేపు ఇలా ఉండక తప్పలేదు.

- ఆంధ్రజ్యోతి, పుట్లూరు

కౌన్సిలర్ల వల్లే నాకు పేరు ప్రతిష్టలు

● కౌన్సిల్ మీట్‌లో జేసీపీఆర్ భావోద్వేగం


వైస్‌చైర్మన్ అబ్దుల్‌రహీంను సన్మానిస్తున్న జేసీపీఆర్

తాడిపత్రి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. అందులో అధికారులు అజెండా చదివి సభ్యులకు వినిపించారు. తర్వాత పదవులకు రాజీనామా చేసిన మున్సిపల్ వైస్‌చైర్మన్లు అబ్దుల్‌రహీం, సరస్వతిలను జేసీ ప్రభాకర్ రెడ్డి పూలమాలలు, శాలువాలతో సన్మానించి మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తనకు పేరు ప్రతిష్టలు వచ్చాయంటే ఈ కౌన్సిలర్ల వల్లేనని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల ముందు ప్రతి కౌన్సిలర్‌ను వైస్‌చైర్మన్‌గా చేస్తానని చెప్పానని, అందులో భాగంగానే మరికొందరిని అవకాశం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఈ రాజీనామాలు చేయించామని భావోద్వేగానికి గురయ్యారు. ఇలాంటి కౌన్సిలర్లు ఉండడం వల్ల పట్టణ అభివృద్ధితోపాటు తన ప్రతిష్ఠ పెరిగిందని చేతులెత్తి నమస్కరిస్తూ కంటతడి పెట్టారు. కౌన్సిలర్లు ఎన్నికల అనంతరం ప్రలోభాలకు లొంగకుండా నా వెన్నంట నిలిచి నన్ను ఈ స్థాయికి తెచ్చారని, మీ రుణం మర్చిపోలేనని పేర్కొన్నారు. మీరందరూ సహకరించడం వల్లే ఈరోజు మున్సిపాలిటీ ఇంత అభివృద్ధిలో ఉందని తెలిపారు. తాడిపత్రి మున్సిపాలిటీకి బ్యాంక్ ద్వారా రుణాలు పొంది సోలార్ సిస్టంను త్వరలోనే తీసుకొస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మామ హత్య కేసులో అల్లుడి అరెస్టు..

రాయదుర్గం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): సంచారజాతి సంప్రదాయం ప్రకారం వరకట్నం డబ్బును అల్లుడే.. అత్త మామలకు చెల్లించాల్సి ఉంది. అయితే ఈ విషయంలో ఏర్పడిన తగువు వల్ల ఏకంగా మామను అల్లుడు చంపేసిన ఘటనను శనివారం పోలీసులు ఛేదించి నిందితుడు శీనునాయక్‌ను అరెస్టు చేశారు. కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నాలుగురోజుల క్రితం డీ.హీరేహాళ్ మండలం ఓబుళాపురం గ్రామం వద్ద గుర్తు తెలియని శవం పడి ఉన్న సంఘటనలో అనుమానాస్పద స్థితిగా కేసు నమోదు చేసిన విషయం విధితమే. అందులో మహారాష్ట్రలోని మీరజ్ పట్టణానికి చెందిన పాలి శంకర్‌బోస్లే(40) సంచారజాతికి చెందిన వాడు కావడంతో కుటుంబ సమేతంగా సంచరిస్తూ ఓబుళాపురం వద్ద తన కుటుంబంతో నెల రోజుల క్రితం స్థిరపడ్డాడు. అంతకు ముందే ఎనిమిది ఏళ్ల క్రితం శంకర్‌బోస్లే కుమార్తె భారతిను కర్ణాటకలోని బళ్లారి జిల్లా సంగనకల్లు గ్రామానికి చెందిన శీనునాయక్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. మీరజ్‌లో దొంగతనాల కేసుల్లో ఉన్న శంకర్‌బోస్లే బళ్లారికి సమీపంలో తలదాచుకోవడంలో భాగంగా ఓబుళాపురంలో ఉంటున్నాడు. కాగా ఆర్థికంగా ఇబ్బందులు ఉంటుండడంతో ప్రేమించి పెళ్లి చేసుకున్నప్పటికీ తమ ఆచారం ప్రకారం వరకట్నం డబ్బును ఇవ్వాల్సిందిగా పదే పదే అల్లుడిని ఒత్తిడి చేస్తూ వచ్చాడు. కాగా అల్లుడు శీనునాయక్ అంతకు ముందే రూ. 80 వేలు అప్పుగా మామకు చెల్లించి.. ఆ డబ్బునే వరకట్నం డబ్బుగా సర్దుకోవాలని చెప్పాడు. అయితే అతను వినిపించుకోకుండా కట్నం డబ్బు ఇవ్వకపోతే తన కుమార్తెను తమ ఆచారం ప్రకారం ఇంకొకరికి ఇచ్చి వివాహం చేసిస్తానని బెదిరిస్తూ వచ్చాడు. దీంతో తట్టుకోలేకపోయిన శీనునాయక్ 20వ తేదీన మామను కత్తితో పొడిచి చంపి పరారయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో శీనునాయక్‌ను గాలించి అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును నాలుగురోజుల్లో ఛేదించిన సీఐ వెంకటరమణతో పాటు ఎస్ఐ గురుప్రసాద్‌ను ఎస్పీ జగదీష్ అభినందించినట్లు చెప్పారు.

వింత వ్యాధితో 18 గొర్రెలు మృతి

కళ్యాణదుర్గం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వైద్యులకు కూడా అంతుచిక్కని వ్యాధితో 18 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన కంబదూరు మండలం రాళ్ల అనంతపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. మల్లప్ప, ఈరన్న అనే గొర్రెల కాపరులకు చెందిన 18 గొర్రెలు ఒక్క రోజులోనే వింత వ్యాధితో చనిపోయాయి. విషయం తెలుసుకున్న పశుసంవర్ధక శాఖ సిబ్బంది నూతిమడుగు వెటర్నరీ వైద్యులు సమతారెడ్డి ఆదేశాలతో ఏహెచ్ఏలు శ్వేతారెడ్డి, భరత్ కుమార్ గోపాల మిత్ర, అక్కులప్ప ఘటన స్థలానికి చేరుకుని వివరాలు, వైద్య లక్షణాలను బట్టి చూస్తే వింత వ్యాధితో గొర్రెలు మృతి చెందినట్లు తెలిపారు. నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపామని వెల్లడించారు. అనంతరం గొర్రెల కాపరులు మాట్లాడుతూ ఈ ఘటనతో సుమారు తమకు రూ. రెండు లక్షలకు పైగా ఆర్థిక నష్టం వాటిల్లిందని బాధను వ్యక్తం చేశారు. కావున పశుసంవర్ధక శాఖ అధికారులు తగు చర్యలు తీసుకుని ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చూడాలని గొర్రెల కాపరులు కోరుతున్నారు.

భార్యపై హత్యాయత్నం

● బ్లేడుతో గొంతు కోసి పరారైన భర్త


గాయపడిన మౌనిక

గుంతకల్లుటౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలూరు రోడ్డులో శనివారం దేవరాజ్ అనే వ్యక్తి తన భార్య గొంతును బ్లేడ్‌తో కోసి పరారయ్యాడు. మండలంలోని గొల్లలదొడ్డికి చెందిన లారీ డ్రైవర్ దేవరాజ్‌కు హైదరాబాద్‌కు చెందిన మౌనిక ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైంది. ఈ పరిచయం ప్రేమగా మారడంతో ఏడాది క్రితం వివాహం చేసుకున్నారు. పట్టణంలోని దోనిముక్కల రోడ్డులో కాపురం పెట్టారు. మౌనిక ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి. అయితే అబార్షన్ చేయించుకోవాలని ఆమెను దేవరాజ్ గత కొద్ది రోజులుగా వేధిస్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాదులో ఉన్న మౌనికను అతను ఫోన్ చేసి శుక్రవారం గుంతకల్లుకు రప్పించాడు. ఈ క్రమంలో శనివారం ఆలూరు రోడ్డులో నడుచుకుంటూ వెళుతూ.. గర్భం తీయించుకోవాలని మౌనికను మరోసారి కోరాడు. దీంతో ఆమె అంగీకరించకపోవడంతో కోపోద్రిక్తుడైన అతను బ్లేడ్‌తో గొంతు కోసి పరారయ్యాడు. గమనించిన స్థానికులు మౌనికను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు ఇదివరకే వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారని, భర్తతో విడాకులు తీసుకుందని, ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.